సంక్రాంతి పండుగ వేళ హైవేలపై భారీ ట్రాఫిక్ జామ్

-రూట్లను మారిస్తే బెటర్ అంటున్న పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

సంక్రాంతి పండుగ సందర్భంగా జెబిఎస్‌లో ప్రయాణికుల రద్దీ దృశ్యం

హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త

సంక్రాంతి పండుగ వేళ నగరంలోని ప్రధాన రహదారులతో పాటు హైవేపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పాడింది. విజయవాడ, వరంగల్, కరీంనగర్, బెంగుళూరు హైవేలతో పాటు పంతంగి టోల్ ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పండుగ కోసం సొంతూళ్లకు వెళుతున్న ప్రయాణికులతో విజయవాడ జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లే వారికి నాగార్జునసాగర్ హైవే మార్గం సూచన విజయవాడ, ఖమ్మం వెళ్లేవారు భువనగిరి మీదుగా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. శనివారం ఉదయం నుంచే రహదారిపై వాహనాలు బారులు తీరాయి. ముఖ్యంగా చౌటుప్పల్ పట్టణం, పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పండుగ సెలవులు మొదలవడంతో వేలాది మంది ఒకేసారి బయలుదేరడం, దీనికితోడు హైవేపై జరుగుతున్న నిర్మాణ పనులు కూడా తోడవడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు. గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే వాహనదారులు విజయవాడ హైవేకు బదులుగా నాగార్జునసాగర్ హైవే మీదుగా ప్రయాణించడం మేలని పోలీసులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నుంచి బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకుని సాగర్ హైవేలోకి ప్రవేశించవచ్చు. ఈ మార్గం కాస్త దూరం ఎక్కువైనా, ట్రాఫిక్ లేకుండా సాఫీగా ప్రయాణం సాగించవచ్చని చెబుతున్నారు. సాధారణ మార్గంలో పంతంగి టోల్‌ప్లాజా వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అలాగే ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి మీదుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్ వద్ద ఎగ్జిట్ తీసుకుని వరంగల్ హైవేపైకి చేరుకుని, అక్కడి నుంచి భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. చిట్యాల నుంచి నార్కట్‌పల్లిని దాటితే ట్రాఫిక్ కష్టాలు చాలా వరకు తగ్గుతాయని వివరిస్తున్నారు. అంతే కాకుండా ఆదివారం చౌటుప్పల్‌లో జరిగే వారంతపు సంతతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పండుగ రద్దీకి సంత కూడా తోడైతే పరిస్థితి తీవ్రంగా మారుతుందని, కాబట్టి ఆదివారం ప్రయాణించే వారు కచ్చితంగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. వాహనదారులు ఓపికతో వ్యవహరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

హైదరాబాద్ వార్త



ఊర్లకు వెళ్లే వారు ఇంటి భద్రతపై శ్రద్ధ వహించాలి

-సిపి సజ్జనార్

హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త

సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నగర ప్రజలకు పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. పండుగకు ఊర్లకు వెళ్లే వారు ఇంటి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పండుగ వేళ తాళం వేసి ఉన్న ఇళ్లపైనే దొంగల కన్ను ఉంటుందని హెచ్చరించారు. శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన సీపీ సజ్జనార్, నగదు, విలువైన ఆభరణాలను బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో ప్రయాణానికి సంబంధించిన అప్డేట్స్ పోస్టు చేయవద్దని, ఇంటి వద్ద ఎవరూ లేరని దొంగలకు సంకేతాలు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఊరు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని తెలిపారు. మీ భద్రతే మా బాధ్యత అంటూ నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. యాడ అమ్మినా ఊరుకోకండి.. అదే సమయంలో మరో ట్వీట్లో చైనీస్ మాంజాపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'చైనీస్ మాంజా యాడ అమ్మినా ఊరుకోకండి. పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి. మీరు కొనకండి, పక్కవాళ్లను కూడా కొననివ్వకండి' అంటూ స్పష్టం చేశారు. చైనీస్ మాంజా కేవలం దారం కాదని, అది మనుషుల పాలిట యమపాశమని, పక్షుల గొంతు కోసే రక్కసి అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం నిషేధించిన చైనీస్ మాంజాను వాడితే కఠిన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి

-నిరుద్యోగుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

హుడా కాంప్లెక్స్, జనవరి 10, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి సంవత్సరంలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి అమలు చేస్తామని అధికారంలోకి రాగానే నిరుద్యోగులను మోసం చేశారని నిరుద్యోగులు ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని మలక్ పేట దిల్‌సుఖ్ నగర్ రోడ్ పై నిరసన వ్యక్తం చేస్తు బైఠాయించారు. పోలీసులు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మంత్రి శ్రీధర్ బాబు ఇప్పటికే 70వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గవర్నమెంట్ నోటిఫికేషన్ వేయకుండా జాబ్‌లు ఎట్లా ఇచ్చింది. గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకుని గప్పాలు కొడుతోందన్నారు.

కేంద్ర గ్రంథాలయం వద్ద బిజెపి ఆందోళన

-ఉద్రిక్తత.. పోలీసులతో వాగ్వాదం అరెస్టులు

చిక్కడపల్లి జనవరి 10,ప్రభాతవార్త : నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఛలో అశోక్ నగర్ ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పెద్ద సంఖ్యలో అశోక్ నగర్ కేంద్ర గ్రంథాలయం వద్దకు చేరుకున్న నిరుద్యోగులు, బీజేవైఎం కార్యకర్తలు రావడంతో ఉద్రిక్తతకు దారితీయడంతో ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు ఆందోళనకారులకు మధ్య కొంత సేపు వాగ్వాదం చెలరేగింది. పోలీసులు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ తో పాటు పలువురిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా గణేష్ విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను బట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఓట్ల కోసం లైబ్రరీ చుట్టూ తిరిగిన రేవంత్ రెడ్డి నేడు వారికి ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. ప్రజా సంక్షేమం కోసం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నిరుద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. నిరుద్యోగులు ఏమి అడిగారు? ఎన్నికల ముందు సీఎం ఇచ్చిన హామీలైన రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఇవి అమలు చేయమని అడిగితే . పోలీసులను ప్రయోగించి యువత గొంతు నొక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరు రాజకీయానికి పరాకాష్ట అని అన్నారు. దేశమంతా రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు ఇస్తుంటే, తెలంగాణలో మాత్రం అదే పార్టీకి చెందిన సీఎం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. బిజెవైఎం ఆధ్వర్యంలో యువతను ఏకం చేసి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం చేస్తాం అని హెచ్చరించారు. హరీశ్వర్ రెడ్డి, చిత్తరంజన్ రెడ్డి, కుమార్ యాదవ్, అనితా రెడ్డి. నాగదీప్ గౌడ్ , ప్రదీప్ గౌడ్, మనోహర్ పాల్గొన్నారు

ప్రైవేటు బస్సులపై కేసులు

-ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూళ్లు చేస్తున్న ట్రావెల్స్ యజమానులు

హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త

సంక్రాంతి రద్దీని ఆసరాగా చేసుకుని నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై తెలంగాణ రవాణా శాఖ ఉక్కుపాదం మోపుతోంది. పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు యజమానులు ప్రయాణికుల నుంచి టికెట్ ధరలు పెంచి వసూళ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ బస్సులపై జనవరి 10వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. ఇప్పటివరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సుమారు 98ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రతను విస్మరించి బస్సుల్లో అధికంగా సరుకు రవాణా చేయడం, ప్రయాణికుల వివరాలతో కూడిన జాబితాను నిర్వహించకపోవడం, అత్యవసర సమయంలో అవసరమైన ఫస్ట్ ఎయిడ్ బాక్సులను అందుబాటులో ఉంచకపోవడం వంటి పలు ఉల్లంఘనలను రవాణా శాఖ గుర్తించింది. పండుగ సీజన్ ముగిసే వరకు ప్రైవేట్ ఆపరేటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించిన రవాణా శాఖ, నిఘాను మరింత కట్టుదిట్టం చేసింది. ఇందుకోసం ఎనిమిది ప్రత్యేక తనిఖీ బృందాలను రంగంలోకి దించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల రవాణా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం, ఎక్కడా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. పండుగ సమయంలో ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా అధిక ఛార్జీలు వసూలు చేయడంపై రవాణా శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక ఛార్జీలు వసూలు చేయరాదని తెలిపింది. కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులను నిబంధనలకు విరుద్ధంగా స్టేజ్ క్యారేజీలుగా మార్చి ప్రతి స్టాప్‌లో ప్రయాణికులను ఎక్కించుకోవడం నిషిద్ధమని స్పష్టం చేసింది. ఉల్లంఘనలకు పాల్పడే ట్రావెల్స్ యాజమాన్యాలపై కఠిన చర్యలతో పాటు అవసరమైతే లైసెన్సుల రద్దుకూ వెనుకాడబోమని హెచ్చరించింది. ఇదిలా ఉండగా, స్లీపర్ బస్సుల నిర్వహణపై కూడా రవాణా శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. స్లీపర్ బస్సుల భద్రత, నిర్వహణకు సంబంధించి త్వరలోనే నూతన మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని తెలంగాణలో రాకపోకలు సాగిస్తున్న స్లీపర్ బస్సుల బాడీ బిల్డింగ్, సాంకేతిక ప్రమాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నిర్ణయించారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ జాతీయ సమావేశం

-హాజరైన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

సమావేశానికి హాజరైన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త: ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపిసి) జాతీయ కార్యవర్గ సమావేశం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. దీనికి దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొని "ఆశయాల రాజకీయ నిర్మాణం" అనే అంశంపై విస్తృతంగా చర్చించారు. చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి అధ్యక్షత జరిగిన ఈసమావేశంలో హక్కుల ఆధారిత, ప్రజా విధానాలు బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి. ముఖ్యంగా ఈసమావేశంలో ఫైనాన్షియల్ సేవలు ,ఆరోగ్య రంగం వైద్య వ్యవస్థలు, పరిశోధన, వ్యాపారోత్పత్తి, ఉపాధి, సమాన మార్కెట్ విధానాలు, వ్యవసాయ నిపుణులు – రైతులు, గ్రామీణ జీవనోపాధి ఆర్కిటెక్చర్ – పట్టణ ప్రణాళిక, క్రీడలు – క్రీడా విధానాలు, సామాజిక సమగ్రత – సమానత్వం, తదితర అంశాలపై సభ్యులు చర్చించారు. ఈసందర్భంగా చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ కేవలం సంక్షేమానికి పరిమితం కాకుండా, ప్రజల ఆశయాలను సాధ్యమయ్యేలా చేసే రాజకీయాల అవసరాన్ని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. ఆదిత్య రెడ్డి గిల్లెల్లా.. మాట్లాడుతూ, వృత్తిపరమైన నిపుణులు విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి అజారుద్దీన్ హాజరుకాగా ఇటీవల డిసిసి అధ్యక్షులుగా నియమితులైన ఏఐపిసి నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డిసిసి అధ్యక్షులు ఖాలిద్,సికింద్రాబాద్ అధ్యక్షులు దీపక్ జాన్.. పాల్గొని, తమ అనుభవాలను పంచుకున్నారు. అలాగే కేరళలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన డా. మన్మోహన్ సింగ్ ఫెలోస్ తమ అనుభవాలను పంచుకున్నారు

అంబర్‌పేట ఎస్సై భానుప్రకాశ్ రెడ్డి అరెస్టు

హైదరాబాద్, జనవరి 10 ప్రభాతవార్త :

హైదరాబాద్‌లోని అంబర్‌పేట ఎస్సై భానుప్రకాశ్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. చోరీ కేసులో రికవరీ చేసిన సొమ్మును వాడుకున్న కేసులో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అతను రిమాండ్‌లో ఉన్నట్లు సమాచారం. మరోవైపు సర్వీస్ రివాల్వర్ మిస్సింగ్ కేసులోనూ దర్యాప్తు కొనసాగుతోంది. అంబర్‌పేట ఎస్ఐ భానుప్రకాశ్‌కు సంబంధించిన 9 ఎంఎం సర్వీస్ రివాల్వర్ మిస్సింగ్ వ్యవహారం ఇప్పటికీ కొలిక్కి రాలేదు. విజయవాడలో ఓ లాడ్జిలో తాను చదువుకునే పుస్తకాల దగ్గర పెట్టుకున్నప్పుడు అది మిస్ అయిందంటూ ఎస్ఐ చెప్పడంతో హైదరాబాద్ పోలీసులు విజయవాడలోని లాడ్జి, అందులో పనిచేసే బాయ్స్, హోటల్ యజమానిని ప్రశ్నించారు. సీసీటీవీ ఫుటేజ్ కూడా పరిశీలించారు. తుపాకీకి సంబంధించిన ఆనవాళ్లు కనిపించలేదు.. అసలు ఆ తుపాకీ వ్యవహారమేంటో తమకు తెలియదని లాడ్జి యాజమాన్యం చెప్పినట్లు సమాచారం. బెట్టింగ్ బాబు భాను ప్రకాశ్ తన జల్సాల కోసం తుపాకీని అమ్మేశాడంటూ ఆయన బ్యాచ్‌మేట్స్ చెప్పుకుంటున్నారు. తాను ట్రైనింగ్ తీసుకునే సమయంలో కూడా విపరీతంగా బెట్టింగ్ ఆడేవాడని, ఆ తర్వాత తన ఇంట్లో బంగారం తీసుకొచ్చి కూడా బెట్టింగ్‌లో పెట్టాడని ఆయన సహచరులు చెప్పారు. ఏపీలో తనకు పీసీబీలో ఉద్యోగం వచ్చిన తరువాత అందులో జాయిన్ కావాలంటే ఇక్కడ ఎన్ఓసీ తీసుకోవాలని అందుకోసం ఇక్కడకు వచ్చి తన డ్రాలో చూసుకుని రివాల్వర్ కనిపించడం లేదని చెప్పడం, ఆ తర్వాత తన వెంటనే తీసుకెళ్లి తుపాకీని విజయవాడ లాడ్జి మరిచిపోయినట్లు చెప్పడం.. ఇలా పొంతన లేని మాటలతో కాలయాపన చేస్తున్నారు.. టాస్క్‌ఫోర్స్‌ను ఉరికిస్తున్నారు తప్ప అసలు రహస్యం ఇప్పటికీ భానుప్రకాశ్ నోటివెంట బయటకు రావడం లేదు. ఇప్పటికే ఆ తుపాకీ ఎన్ని చేతులు మారిందనేది ప్రస్తుతం పోలీస్‌శాఖలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా తుపాకీ కుదువ పెట్టి మొదట్లో ఐదు లక్షలు తెచ్చుకున్న తర్వాత మళ్లీ పైసల కోసం వెళ్తే అది అమ్మేస్తానని చెప్పడంతో ఆ తుపాకీని రాయలసీమ గ్యాంగ్స్‌కు అమ్మేసినట్లుగా ప్రచారం జరుగుతుంది. ఇందులో ఎంత నిజముందో తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నించినా చిన్న క్లూ కూడా దొరకడం లేదని ఓ సీనియర్ ఆఫీసర్ చెప్పారు. అసలు సర్వీస్ రివాల్వర్ విషయంలో ఇంత నిరక్ష్యంగా ఉంటారా అంటూ పోలీసులే మాట్లాడుకుంటున్నారు. మరోవైపు సస్పెన్షన్‌కు గురైన అధికారుల నుంచి సర్వీస్ గన్స్ స్వాధీనం చేసుకోవడం లేదని తెలుస్తుంది. 9ఎంఎం పిస్టల్‌కు సంబంధించి బుల్లెట్లు కూడా బయట దొరకవని పోలీసులు అనుకుంటున్నారు. ఏదేమైనా గన్ మిస్సింగ్ వ్యవహారం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది.

అక్రమ హోర్డింగ్‌లపై జిహెచ్ఎంసి నజర్

-ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో ప్రత్యేక డ్రైవ్

-అక్రమ హోర్డింగులు, బ్యానర్లు తొలగింపు

హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:

జిహెచ్ఎంసి పరిధిలోకి పలు మున్సిపాలిటీల విలీనానంతరం, నగరంలోని వివిధ ప్రాంతాల్లో అనధికార ప్రకటనలు ఉన్నట్లు గుర్తించామని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శనివారం తెలిపారు. మున్సిపల్ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో, అనధికార ప్రకటనలను గుర్తించి తొలగించేందుకు జీహెచ్ఎంసీ ఈ డ్రైవ్‌ను ప్రారంభించిందన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటికే పలు అక్రమ హోర్డింగ్‌లు, బ్యానర్లు తదితర అనధికార ప్రకటనలను తొలగించినట్లు ఆయన వెల్లడించారు. ప్రజా భద్రత, నగర సుందరీకరణను కూడా దృష్టిలో పెట్టుకుని జిహెచ్ఎంసి పరిధి అంతటా ఈ డ్రైవ్ దశలవారీగా, నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనధికార ప్రకటనలపై పర్యవేక్షణ, నియంత్రణ, చర్యల కోసం ప్రత్యేక ఎన్ ఫోర్స్ మెంట్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రకటనదారులు, ప్రకటన ఏజెన్సీలు, భవన యజమానులు తప్పనిసరిగా నిబంధనలను పాటిస్తూ అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణాలు, ప్రకటనలు ఏర్పాటు చేయాలని కమిషనర్ కోరారు.

నూతన సంవత్సరంలో తెలుగుజాతి మొదటి పండుగ సంక్రాంతి

: రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా

సంక్రాంతి సంబంరాల్లో చిన్నారుల నృత్యప్రదర్శన

రవీంద్రభారతి, జనవరి 10 ప్రభాతవార్త : ఆంగ్ల నూతన సంవత్సరంలో మొట్టమొదటిగా విచ్చే తెలుగుజాతి పండుగ సంక్రాంతి అని, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కొత్తపంట–కోడిపందాలతో, పట్టణాలతో యువత పతంగులతో, ముఖ్యంగా ఇంటి కూతురు అల్లుళ్లు ఆటపాటలతో ఎంతో వేడుకగా 3రోజులపాటు ఘనంగా జరుపుకుంటారని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో గ్లోబల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంగరంగ వైభవంగా జరిగిన సంక్రాంతి సంబరాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన దామోదర్‌గుప్తా ఆత్మీయ అతిథులు దైవజ్ఞశర్మ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి. రమణారావు, డా. నాగుల శ్యాంగౌడ్, ఐశ్వర్య, డా. పి.ఝాన్సీ రామ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి సంబరాలను ప్రారంభించి ఆయా ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను, గురువులను ఘనంగా సన్మానించారు.

విశ్రాంత జడ్జికి ఐపిఎస్ అంటూ టోకరా

- నకిలీ ఐపిఎస్ బత్తిని శశికాంత్‌పై మరో కేసు నమోదు

బత్తిని శశికాంత్(ఫైల్ ఫొటో)

జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్త:

ఒక విశ్రాంత ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జిని మోసం చేసిన వ్యవహారంలో నకిలీ ఐపీఎస్ బత్తిని శశికాంత్‌పై ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్లో మరో కేసు నమోదైంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. బత్తిని శశికాంత్ తనను తాను ఐపీఎస్‌గా చెప్పుకొని విశ్రాంత ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి అశోక్‌బాబుకు పరిచయం చేసుకున్నాడు. ఫిల్మ్‌నగర్‌లోని అపర్ణ బౌరాలో అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఫ్లాట్ జీ–3ను అక్రమంగా ఆక్రమించుకున్నాడు. 2025 ఫిబ్రవరి నుండి అద్దె చెల్లించకుండా ఫ్లాట్‌ను ఆక్రమించి ఉండటమే కాకుండా తనను బెదిరింపులకు గురిచేసి మానసికంగా వేధిస్తున్నాడంటూ అశోక్‌బాబు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బత్తిని శశికాంత్‌పై ఇప్పటికే ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్లో నకిలీ ఐఏఎస్, ఐపీఎస్‌నంటూ గోల్డ్‌జిమ్ సంస్థ ఎండీ అలీ హసన్‌ను రూ. 10.50 లక్షలు మోసం చేశాడు. ఈ వ్యవహారంలో అతను ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బత్తిని శశికాంత్‌ను అరెస్ట్ చేశారు. కాగా అతనిపై కర్నూలు జిల్లాలో ఉద్యోగాల పేరుతో రూ. 15లక్షలు మోసం చేసిన సంఘటనలో కేసు నమోదైంది. అలాగే మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కోటేశ్వర్‌రావు అనే వ్యక్తిని రూ. 50లక్షల మేర మోసం చేశాడు. శశికాంత్ ఇంకా చాలా చోట్ల ఐఏఎస్, ఐపీఎస్, కేంద్ర హోంశాఖ తదితర పేర్లతో మోసాలకు పాల్పడ్డట్లు పోలీసులు చెబుతున్నారు.

ర్యాపిడో ముసుగులో గంజాయి విక్రయం

- ర్యాపిడో డ్రైవర్ అరెస్ట్, 137 గ్రాముల గంజాయి స్వాధీనం

జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్త:

ర్యాపిడో డ్రైవర్ ముసుగులో గంజాయి విఝ్రిస్తున్న ఒకరిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. తెలిసిన వారికి విఝ్రించడానికి చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి అతను విఝ్రిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12 ప్రాంతంలో గంజాయి విఝ్రిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేయగా ఒకరి వద్ద గంజాయి లభ్యమైంది. అతన్ని విచారించగా బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లోని ఇబ్రహింనగర్‌కు చెందిన ర్యాపిడో డ్రైవర్ మహ్మద్ సర్వర్(24)గా గుర్తించారు. అతని వద్ద 137 గ్రాముల గంజాయిని 21 ప్యాకెట్లలో స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనికి మాజిద్, సోహైల్ అనే వ్యక్తులు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మాజిద్, సొహైల్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

దేవాలయాలను కాపాడుకోవాలి

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రవిప్రసాద్ గౌడ్ తదితరులు

సికింద్రాబాద్, జనవరి 10 ప్రభాతవార్తః సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ 2026 సోమనాథ్ ఆలయంపై 1025 జనవరిలో గజనీ మహమ్మద్ దాడి చేసి 2026 నాటికి 1000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 1951లో ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా అమృతోత్సవం పేరుతో భారత ప్రధాని నరేంద్ర మోదీ జనవరి 11న సోమనాథ్ క్షేత్రంలో సహస్ర సంకల్పయాత్ర ప్రారంభిస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు. నరేంద్ర మోదీ పిలుపుమేరకు ఈరోజు బౌద్ధనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్‌లొని అంబర్ నగర్ సీతారామాంజనేయ శివపంచాయతన దేవాలయం, బౌద్ధనగర్ శ్రీ సీతారామాంజనేయ దేవాలయంలో గల శివాలయాలలో ఓంకార జపం, అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ దేవాలయాలను మన సొంత ఇంటి కంటే ఎక్కువగా కాపాడుకోవాలనిన్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్. నేతి సత్యనారాయణ ,కొమరయ్య, నాగరాజ్, భరద్వాజ్.వెంకట చైతన్య, ఒములు, శ్యామ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

సంయుక్త శిష్య బృందంతో కర్ణాటక సంగీత గాన గోష్టి

సంగీత కళాకారులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి జనవరి 10 (ప్రభాతవార్త) : చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణ లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో గాన సభ లోని సంగీత నాట్య కళా వేదిక పై గత మూడు రోజులు గా జరుగుతున్న త్యాగరాజ స్వామి ఆరాధన సంగీత నృత్య కార్యక్రమాలలో భాగంగా శనివారం ప్రముఖ సంగీత గురువు సంయుక్త తన శిష్య బృందం తో కలిసి త్యాగరాజ విరచిత ఎందరో మహానుభావులు , తెరతీయగ రాదా తదితర కీర్తనలు శృతి లయ రాగాల తాళ బద్ధం గా గానం చేశారు ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సంయుక్త గాన సభలో సంగీత గురువు అని తెలిపారు గాన సభ ఉచితం గా శాస్త్రీయ నృత్య సంగీత వేణు వాదన కళా ప్రక్రియల్లో శిక్షణ ఇస్తోంది అని తెలిపారు ఆసక్తి కల వారు ఏ వయస్సు వారైనా గాన సభ లో వివరాలు తెలుసుకోవచ్చు అని చెప్పారు ప్రత్యేక అతిథిగా ప్రముఖ మహిళా సంస్థ అభినందన స్టాపకురాలు భవాని మాట్లాడుతూ గాన సభ త్యాగరాజ స్వామి పేరిట ఏళ్ళ క్రితం నిర్మించటం త్యాగరాజు పట్ల భక్తి కి నిదర్శనమన్నారు.గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి పాల్గొన్నారు.

నటభూషణ్‌కు నవ రస సినీగీత నివాళి

కార్యక్రమంలో పాల్గొన్న వంశీ రామరాజు, కొండూరు రవి బాల సుబ్రహ్మణ్యం తదితరులు

చిక్కడపల్లి జనవరి 10 ప్రభాతవార్త : నటభూషణ్ బిరుదు గాంచిన శోభన్ బాబుకు సినీ గీతాలతో కొండూరి భారతి సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై శనివారం స్వర నివాళులు అర్పించారు. సంస్థ స్థాపకుడు కొండూరు రవి సహా గాయకులు రేవతి, అఖిల తదితర గాయకులతో శోభన్ బాబు సినిమా లలోని పాటలు సుమధురంగా గానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీ రామ రాజు మాట్లాడుతూ శోభన్ బాబు సహజంగా ఎట్టి సాంస్కృతిక సంస్థలు కార్యక్రమాలకి రారు కానీ తాను పట్టు పట్టి వంశీ సంస్థ ను ఆయన చేతనే ప్రారంభం చేయించిన సంగతి గుర్తు చేసుకున్నారు.కొండూరు రవి బాల సుబ్రహ్మణ్యం నిర్వహించిన పాడుతా తీయగా కార్యక్రమంలోని గాయకుడు ఆయనకి ఇష్టుడని చెప్పారు. తల్లి పేరు పైన సంస్థను పెట్టి ఎందరో గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నారని అభినందించారు.రవి గాయనీ గాయకులను సత్కరించారు.

పిల్లలకు మన సంస్కృతి నేర్పించాలి: వల్లీశ్వర్

నృత్యకళాకారులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి జనవరి 10 (ప్రభాతవార్త) : పిల్లలకు చదువుతో పాటు మన సంస్కృతిని తెలియచేయడం ఎంతో ముఖ్యమని ప్రముఖ పాత్రికేయులు జి.వల్లీశ్వర్ అన్నారు. శనివారం నల్లకుంట శ్రీ శృంగేరి శంకర మఠం, శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శృంగేరి శంకర మఠం లో శ్రీ వాణి నృత్య నికేతన్ విద్యార్థులచే సంస్థ అధినేత శ్రీ రమ వాణి సుందరి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ప్రముఖ కవి రఘుశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జి వల్లీశ్వర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పిల్లలను కళ లను నేర్పిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు .శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి పాలపర్తి సంధ్యారాణి నేతృత్వంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ మన కళ లను,కళా కారులను ప్రోత్సహిస్తున్నందుకు అభినందించారు. సభలో వివిధ రంగాల ప్రముఖులు విక్రమ్ దాచేపల్లి,వడ్లకొండ వెంకట్రావ్,శ్రీ రమ వాణి సుందరి, అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృత్య గురువు శ్రీ రమ వాణి సుందరిని,చిన్నారులను ఘనంగా సత్కరించారు. నృత్య కళాకారులు సాయి వర్షిణి, లాస్య,మేఘన, సహస్ర,శివాన్విత, తన్విక, పర్ణిక,యోషికలు అదిగో అల్లదిగో,గరుడ గమన,పూజా నృత్యం, బ్రహ్మమొక్కటే,జతి స్వరం అంశాలపై నయన మనోహరంగా నృత్యాంశాలు ప్రదర్శించారు.

బేగంపేటలో జరిగిన జెఎన్‌యూ నెక్స్ట్ జెన్ సమ్మిట్-2026లో గురునానక్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, షార్క్ ట్యాంక్ ఇండియా విజేత డాక్టర్ హెచ్.ఎస్. సైని, కనికా అగర్వాల్, శ్రేయ రావు (మిస్ ఇండియా 2018 రన్నరప్) తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయం తీసుకోకపోతే నిరాహార దీక్ష

- 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి

జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్తః 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి సభ్యులకు పదిహేను రోజుల్లో ప్రభుత్వం న్యాయం చేయకుంటే నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించింది. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి అధ్యక్షుడు, మాజీ మంత్రి మేచినేని కిషన్‌రావు, సెక్రటరీ జనరల్ దుశ్చర్ల సుదర్శన్‌రావు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంపై స్పందించాలని, ఉద్యమకారుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఉద్యమకారులకు ఫించను, ఇళ్ల స్థలాలతోపాటు పలు డిమాండ్ల వియంలో ఇప్పటికే కౌన్సిల్‌లో చర్చించారని, ఇందుకు సంబంధించి కమిటీని వేశారన్నారు. ఆయా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరితగతిన నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో తాము నిరాహారదీక్ష చేపడుతామన్నారు. సెప్టెంబరు 15న ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా బీజేపీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్రంలో ఉన్న అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నడ్డాలను ఇప్పటికే కలిశామని కంటోన్మెంటలో వంద ఎకరాల్లో స్మృతివనాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతామని హామినిచ్చారన్నారు. ఇప్పటికే చాలా మంది ఉద్యమకారులు ఉచిత బస్సు సౌకర్యం లేక, వైద్య సదుపాయాలు అందక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాల వల్ల దాదాపు 3000ల మంది ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేసినవారవుతారని వారు వివరించారు.

తమ డిమాండ్లను చూపుతున్న మేచినేని కిషన్‌రావు, దుశ్చర్ల సుదర్శన్‌రావు.

మహాత్మా గాంధీ పేరును తొలగించడం దేశ చరిత్రకు అవమానం : కాంగ్రెస్

సికింద్రాబాద్, జనవరి 10 ప్రభాతవార్తః జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అమానుషమైన చర్య అని, ఇది బీజేపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్న రాజకీయ నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా విమర్శించారు. శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని సీతాఫలమండిలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దీపక్ జాన్, అదం సంతోష్ కుమార్, కోట నీలిమలు మాట్లాడుతూ మహాత్మా గాంధీ పేరు భారతదేశానికి మాత్రమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా అహింస, సత్యం, శ్రమకు ప్రతీకగా నిలిచిందని అన్నారు. అలాంటి మహానీయుడి పేరును ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం ద్వారా బీజేపీ ప్రభుత్వం తన గాంధీ వ్యతిరేక భావజాలాన్ని మరోసారి బహిర్గతం చేసిందని ఆరోపించారు. దేశంలో పేదలు, కూలీలు, గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించిన అత్యంత కీలకమైన పథకానికి గాంధీ పేరు జత చేయడం వెనుక లోతైన తత్వం ఉందని వారు గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను వక్రీకరించడం, గాంధీ సిద్ధాంతాలను నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారిందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఇప్పుడు ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరు తొలగించడం ద్వారా దేశ ప్రజల మనోభావాలను గాయపరిచిందని, ఇది ప్రజాస్వామ్య దేశంలో ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.మహాత్మా గాంధీ పేరు తొలగించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ అంశంపై ఉద్యమాలు, నిరసనలు కొనసాగుతాయని, ప్రజల తరపున పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, గాంధీ ఆశయాలను కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సందీప్ రాజ్, షకిల్ ఖాన్, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, ఘంటా రాజుసాగర్, సురేష్ లాల్, జగ్గు, అనిల్ పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

కెటిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్తః కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఖైరతాబాద్ క్రాస్ రోడ్స్‌లో శనివారం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దగ్ధం చేశాయి. తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంఛార్జి సైద్ ఖాలిద్ సూచనల మేరకు ఖైరతాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడారం హరిధర్ నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ. హరీష్‌రెడ్డి, శశి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్.

జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్తః జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీనగర్‌కాలనీ నుండి అమీర్‌పేట వాల్యూజోన్ వరకు కొనసాగుతున్న రోడ్డు పనులను శనివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ పరిశీలించారు. రూ. 50 లక్షలతో ఇక్కడ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : మంత్రి అజారుద్దీన్

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హజారుద్దీన్

మెహిదీపట్నం, జనవరి 10, ప్రభాతవార్త : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంత్రి హజారుద్దీన్ అన్నారు. టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమానికి తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తో పాటు మంత్రి హజారుద్దీన్ హాజరై మాట్లాడారు..యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు బానిసైతే జీవితం నాశనం అవుతోందని, వారి వల్ల కుటుంబాలు, సమాజం నష్టపోతుందని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మత్తు రహిత సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ముందుగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిపి చంద్రమోహన్, కాంగ్రెస్ పార్టీ కార్యాన్ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఉస్మాన్ బిన్, స్థానిక కాంగ్రెస్ నాయకులు గౌని సంతోష్ గౌడ్, బిజ్జు దుర్గాప్రసాద్, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

నూతన సీవరేజీ లైన్లు వేయండి

జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్తః జూబ్లీహిల్స్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎదురవుతున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నూతన సీవరేజీ లైన్లు వేయాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కోరారు. ఇందిరానగర్ స్టేజ్ నుండి పోచమ్మ ఆలయం వరకు, జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 5, ఫిల్మ్‌నగర్ పద్మాలయ అంబేద్కర్ నగర్ బస్తీ, వినాయకనగర్ ప్రధాన దారి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు సత్వరమే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరారు.

జూపార్కు డిప్యూటీ క్యూరేటర్‌గా మురళీధర్

జూపార్కు క్యూరేటర్ జె.వసంతను కలిసి బోకే అందజేస్తున్న డిప్యూటీ క్యూరేటర్ జె.మురళీధర్

చార్మినార్,జనవరి 10 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజీకల్ పార్కు డిప్యూటీ క్యూరేటర్‌గా జె. మురళీధర్ శనివారం పదవి భాద్యతలు స్వీకరించారు. దాదాపు పద్దెనిమిది నెలలు పాటు జూపార్కు డిప్యూటీ క్యూరేటర్‌గా పని చేసిన ఎం.బర్నోబా డిసెంబరు నెల 31వ తేదీన పదవి విరమణ చేశారు.ఆయన స్థానంలో పిసిసిఎఫ్ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పని చేసిన జె.మురళీధర్ జూపార్కు నాలుగువ డిప్యూటీ క్యూరేటర్‌గా నియమితులయ్యారు. శనివారం జూపార్కు క్యూరేటర్ జె.వసంతను కలిసి బోకే అందజేసిన అనంతరం మురళీధర్ పదవి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా జూ పార్కు డిప్యూటీ క్యూరేటర్ జె.మురళీధర్ మాట్లాడుతూ జూ పార్కులోని జంతువుల సంరక్షణ కోసం అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.

గోనె సాల్మన్‌కు రాజుకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలి

సమావేశంలో పాల్గొన్న గోనె సల్మాన్ రాజు,రివర్ సైడ్ లైఫ్ చర్చ్ పాస్టర్లు

చార్మినార్,జనవరి 10 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తూ క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటానికి కృషి చేస్తున్న గోనె సాల్మన్ రాజుకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలని ఓల్డ్ సిటీ ఏరియా పాస్టర్స్ అధ్యక్షులు జయకుమార్ జక్కయ్యస్ అన్నారు. పాతబస్తీ రివర్ సైడ్ క్రిస్టియన్ లైఫ్ చర్చిలో శనివారం జరిగిన ఓల్డ్ సిటీ ఏరియా పాస్టర్స్ సమావేశంలో గోనె సాల్మన్ పాల్గొన్నారు.క్రిస్టియన్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటంతో పాటు కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్న గోనె సాల్మన్ రాజుకు కార్పొరేషన్ పదవి ఇవ్వాలని సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో ఓల్డ్ సిటీ ఏరియా పాస్టర్స్ ఉప అధ్యక్షులు జాన్ మిల్టన్ వినోద్,ప్రధా న కార్యదర్శి రెవరెంట్ బి.సాల్మన్,జాయింట్ సెక్రటరీ అమర్ నాథ్,కోశాధికారి రెవరెంట్ యేజ్కేల్,సంఘం స భ్యులైన పాస్టర్లు ప్రవీణ్,యోనా, కె.చార్లెస్, ఉపేందర్, జెకర్యా, వెంకటయ్య.అమర్నాథ్,జవహర్‌లాల్,దేవిడ్ పాల్గొన్నారు.

మహిళకు బెదిరింపు కాల్స్..కేసు నమోదు

జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్తః గుర్తుతెలియని వ్యక్తుల నుంచి తనకు బెదిరింపుల కాల్స్ వస్తున్నాయంటూ ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణానగర్‌లో నివసించే నిహారిక దువ్వూరి అనే మహిళకు జైటా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులైన అమిత్ ప్రకాశ్, శిల్పా రేవంకర్ తరుపున మాట్లాడుతున్నామంటూ గుర్తుతెలియని నంబర్ల నుండి ఆమెకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఆమె భర్త గతేడాది నవంబరులో ఆ కంపెనీలో రాజీనామా చేశారని, అయితే తప్పుడు ఆరోపణలు అంగీకరించేలా అతనిపై ఒత్తిడి తెచ్చేందుకు అగంతకులు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనికితోడు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లోని క్రీమ్‌స్టోర్ సమీపంలో ఆమె నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి జైటా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలని, లేదంటే తనకు ఇంటి చిరునామా తెలుసంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో తనకు, తన భర్తకు ప్రాణహాని ఉందంటూ ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారతీయ సంస్కృతి సంప్రదాయాలు కళలను భావితరాలకు అందించాలి : మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్

రవీంద్రభారతి, జనవరి 10 ప్రభాతవార్త : ప్రపంచవ్యాప్తంగా స్థిరపడ్డ భారతీయులు తమ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను మరువరాదని, వాటిని భావితరాలకు అందజేయాలని టీపిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ మాటా 3వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మధుయాష్కీ, విశిష్ట అతిథులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద, జబర్దస్త్ ఫేమ్ అదిరే అభి, సంగీతగురు కె.రామాచారి, జోగిని శ్యామల, లింగా శ్రీనివాస్, మాటా ప్రధాన కార్యదర్శి విజయ్‌భాస్కర్ కలాల్, ఇండియా కోఆర్డినేటర్ ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డా. బోల్లం విజయభాస్కర్, మల్లిక్‌రావు, కార్యదర్శి శ్రీధర్ తదితరులతో జ్యోతిప్రకాసనంచేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. దేశ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడానికి మాటా చేస్తున్న ప్రయత్నం హర్షదాయకమన్నారు. మాటా అధ్యక్షుడు కిరణ్ దుగ్గిడి మాట్లాడుతూ మాటా, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంయుక్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఉన్నత శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న 600మంది గ్రామీణ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. సభకుముందు మిమిక్రీ శివారెడ్డి, కె.రామాచారి శిష్యబృందం సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకుని అబ్బురపరిచాయి.

సభలో ప్రసంగిస్తున్న మధుయాష్కీ, వివేకానంద, డా. బి.విజయకుమార్, కె.విజయ్‌భాస్కర్ తదితర అతిథులు

రాజేంద్రనగర్ సర్కిల్‌ను సైబరాబాద్‌లోనే కొనసాగించాలని వినతి

నార్సింగి, జనవరి 10 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్‌ను హైదరాబాద్‌లో కలుపకూడదని, సైబరాబాద్‌లోనే కొనసాగించాలని కోరుతూ బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ ఆల్ పార్టీస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్, బండ్లగూడ జాగీర్ ప్రాంత ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు నేను సిద్దంగా ఉన్నానని, ఈ విషయంపై ఎవరూ ఆందోళన చెందవద్దని నేతలకు సూచించారు. ఈ ప్రాంత అస్థిత్వానికి భంగం వాటిల్లకుండా, ఇక్కడి రాజకీయ నాయకుల భవిష్యత్తుకు ఇబ్బందులు ఎదురవకుండా చూసే బాధ్యత నాదీ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల వేళ మాత్రమే మనమంతా పార్టీల వారీగా విడిపోయి పోటీలు పడుతామని, ఆ తరువాత అందరం కలిసి అన్నదమ్ముల వలే ఉంటామని తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్‌ను చార్మినార్ జోన్‌లో కలుపడం వలన మన ప్రాంత ఆదాయం, అస్థిత్వం రెండింటికి ఎసరు వస్తుందని గ్రహించి ఇటీవల నేను స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని ఎమ్మెల్యే తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో రాజేంద్రనగర్‌ను హైదరాబాద్‌లో కలుపకూడదని, సైబరాబాద్‌లోనే ఉంచాలని కోరడం జరిగిందన్నారు. ఇందుకు సీఎం సానకూలంగా స్పందించారని, త్వరలోనే మనందరికి తీపి కబురు వెలువడబోతుందని ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే హామీతో నాయకులంతా కొంత ఊరట చెంది, ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత పూలపల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన్నే ఉంటుందని, ప్రజలకు ఇబ్బందికరమైన నిర్ణయాలుంటే వెనక్కి తీసుకొని న్యాయం చేసి తీరుతుందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రజల వాయిస్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంతానికి మేలు చేసే ప్రయత్నం చేయడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ అంటేనే కష్టాలను దూరం చేసే పార్టీ అని, మనందరికి మేలు చేసే ప్రకటన త్వరలోనే రాబోతుందన్న ఎమ్మెల్యే మాట నిజమై తీరుతుందని కృష్ణారెడ్డి తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో భీమార్జున్‌రెడ్డి, మాధవరెడ్డి, మహాలింగంగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, సురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్, మహేష్ యాదవ్, నాగరాజు, ప్రేమ్‌కుమార్, సదానందం, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌ను సైబరాబాద్‌లోనే కొనసాగించాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆల్‌పార్టీస్ నాయకులు.

పోలీసుల సూచనలు పాటిద్దాం... దొంగతనాలను నివారిద్దాం : ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి

నార్సింగి, జనవరి 10 ప్రభాతవార్త : హిందువులు జరుపుకునే అతి పెద్ద పండగలలో సంక్రాంతి పండగ ఒకటి. ఈ పండగను అమ్మా,నాన్న,సోదర,సోదరీమణులు, బంధువులు, స్నేహితులందరి మధ్య ఘనంగా జరుపుకునేందుకు చాలా మంది పట్టణ ప్రజలు గ్రామాలకు తరళి వెళ్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజలు ఏకంగా వారం,పది రోజుల పాటు తమ ఇళ్లకు తాళాలు వేసి సొంతూళ్లకు వెళ్తుంటారు. ఇదే అదునుగా భావించి దొంగలు తమ చేతులకు పని చేబుతారు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని రాత్రి వేళల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి విలువైన, ఆభరణాలు, నగద

కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్

వెస్ట్ మారేడ్‌పల్లి టీబీటీ బ్లాక్స్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,జనవరి 10 ప్రభాతార్త: కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని మరింత అబివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలో భాగంగా శనివారం మోండా డివిజన్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లి టీబీటీ బలరామ్ బ్లాక్స్ ప్రాంతాల్లో జిహెచ్ఎంసి,జలమండలి అధికారులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో బస్తీ దవాఖాన లైబ్రేరీ,అంతర్గత రోడ్లు,డ్రైనేజీ, పారిశుద్ధ్యం,వీధి దీపాల వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నో సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే పరిష్కరించినందుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం విద్యా సాగర్, ఏఈలు శ్రవంతి, చంద్రశేఖర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగేశ్‌యాదవ్, సంతోష్ యాదవ్, బద్రి యాదవ్, రసీద్, అరవింద్ యాదవ్, కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలను శుభ్రపర్చడంలో పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర కీలకం : జంపనప్రతాప్

కంటోన్మెంట్ సిబ్బందికి కిట్లను అందజేస్తున్న జంపనప్రతాప్,గౌతమ్ జైన్

కంటోన్మెంట్,జనవరి 10 ప్రభాతార్త: కాలనీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో పారిశుద్ధ్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. ప్రముఖ సంఘ సేవకులు గౌతమ్‌జైన్, దిశా జైన్‌ల ఆధ్వర్యంలో శనివారం యాంటీ మలేరియా సిబ్బందికి బోయిన్ పల్లి సర్కిల్ కార్యాలయంలో ఉచితంగా కిట్లను అందజేశారు.కార్యక్రమంలో భరత్ సింగ్,కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది విజయ్ కుమార్, రామక్రిష్ణ, ఎంఆర్.రాజు, సాయిబాబా యాదవ్,నర్సింహ్మ,రాజు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే తలసాని

టీటీడీ స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట,జనవరి 10 ప్రభాతార్త: ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం తెల్లవారు జామున తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొని పూజలు నిర్వహించారు.

నేడే లీ ప్యాలెస్ సమావేశం . . .

సికింద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం సికింద్రాబాద్ బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తలసాని తెలిపారు. ఈ సమావేశానికి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, వ్యాపార వేత్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్ట్ ఎగ్జిబిషన్ కళాభిమానులకు గొప్ప అనుభూతిని కలిగిస్తుంది : ఎన్వీఎస్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 10 ప్రభాతవార్త

ఆర్ట్ ఎగ్జిబిషన్ కళాభిమానులకు గొప్ప అనుభూతిని కలిగిస్తుందని, ఆర్ట్ క్యాంప్ అనేది కళాకారుని నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ (పట్టణ రవాణ) సలహాదారులు ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. "టూ ఇన్ వన్" చిత్ర కళా ప్రదర్శన మాదాపూర్‌లో ఉన్న చిత్రమయీ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'పరిచయ్ ఆర్ట్ ఫౌండేషన్' శనివారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎన్వీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక కళాకారుడు కళను సృష్టించే ప్రక్రియను ప్రత్యక్షంగా చూసే అవకాశం నేడు కళాభిమానులకు, కొనుగోలుదారులకు కలిగిందని సాధారణంగా రెండూ వేర్వేరుగా నిర్వహించడం చూస్తూ ఉంటామని పేర్కొన్నారు. అయితే రెండు కలిపి ఒకే చోట జరపడం అనేది అరుదైన సందర్భాలలో ఒకటని ఆయన తెలిపారు.సునిశితమైన నైపుణ్యంతో కళాభిమానులను కట్టిపడేసేలా చిత్రకళను నేడిక్కడ ప్రదర్శించడం హర్షణీయమని ఆయన తెలిపారు. చిత్రకారుడు వేసే ప్రతి బొమ్మ వెనుక ఎంతో కృషి, తాదాత్మ్యకత ఉంటుందని, ఆ ప్రయత్నం ఈ కళా ప్రదర్శనలో స్పష్టంగా గోచరించిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తాను హైదరాబాద్‌లో మెట్రో రైలును పట్టాలెక్కించడానికి పడిన శ్రమ, సంకల్ప బలాన్ని ఎన్వీఎస్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. అందుకు తగ్గ ప్రతిఫలం నేడు మనం చూస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ నెట్వర్క్ అని అన్నారు. అలాగే చిత్రకారుడు కూడా తన ప్రతిభాపాటవాన్ని సాన పట్టి తన ఆలోచనలను అందమైన చిత్రంగా మలచడం వెనుక ఎంతో నైపుణ్యం, కృషి ఉంటుందని ఆయన తెలిపారు. చిత్ర కళలో అందె వేసిన 12 మంది చిత్ర కళాకారులను ఒక వేదికపైకి తెచ్చి ఒక గొప్ప ప్రయత్నానికి శ్రీకారం చుట్టిన ప్రముఖ కళాకారులు జయవంత్ నాయుడుని ఎన్వీఎస్ రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, కర్ణాటకకు చెందిన ప్రముఖ కళాకారులు పాల్గొని వారి కళాఖండాలను ప్రదర్శించారు. వారిలో బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, ధన్ ప్రసాద్, కప్పరి కిషన్, కిషోర్ ఘోష్, డా. మల్లికార్జున బగోడి, ప్రీతీ సమ్యుక్త, పి. జె. స్టాలిన్, పి. రవి శంకర్, శంకర్ గైధానే, సయ్యద్ రయీస్ అహ్మద్, వి. బి. బిరదార్, విమల మారోజు తదితరులు పాల్గొన్నారు.

చిత్రమయీ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాఖండాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారులు ఎన్వీఎస్‌రెడ్డి

కొండాపూర్-కొస్గి-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయండి

- సిఎం రేవంత్‌రెడ్డికి రిటైర్డ్ ఇంజినీర్ల సంఘం వినతి

జూబ్లీహిల్స్, జనవరి 10, ప్రభాతవార్త: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఉన్న తీవ్ర కరువు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి కొండాపూర్-కొస్గి-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను మంజూరు చేయాలని అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ హైదరాబాద్ ఇంజినీర్ల సంఘం సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డిని కోరింది. బంజారాహిల్స్‌లోని ఎంపీ ఎమ్మెల్యే కాలనీ క్లబ్‌లో శనివారం అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ హైదరాబాద్ ఇంజినీర్స్(టీఏఆర్‌హెచ్‌ఈ) సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ప్లానింగ్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా పలువురు ఇంజినీర్లు తమ అభిప్రాయాలను తెలియజేయడంతోపాటు సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఇంజినీర్లఉ మాట్లాడుతూ.. ఈ పథకం అమలైతే సుమారు 5.70 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని, మొత్తం 90 టీఎంసీల వరద నీటిని వినియోగించుకునే అవకాశం ఉందని ఇంజినీర్లు తెలిపారు. ఇందులో 57 టీఎంసీలు సాగునీటి అవసరాలకు, 33 టీఎంసీలు నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించడంతోపాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ద్వారా హైదరాబాద్ నగరానికి నీటి భద్రత కల్పించవచ్చని వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లా చరిత్రాత్మకంగా కరువు బారిన పడిన ప్రాంతమని, కృష్ణా, తుంగభద్ర నదులు ప్రవహించినప్పటికీ సాగునీటి కొరత తీవ్రంగా ఉందని సంఘం గుర్తు చేసింది. జిల్లాలో సుమారు 45.55 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉండగా, దాంట్లో 77 శాతం సాగుకు అనుకూలమైన భూమి ఉన్నా, వాస్తవంగా సాగునీరు అందుతున్నది కేవలం 15 శాతం మాత్రమేనని పేర్కొంది. సగటున 700 మిల్లీమీటర్లకు కూడా తక్కువ వర్షపాతం ఉండటం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు తక్షణమే అనుమతి ఇవ్వాలని ఇంజినీర్ల సంఘం ముఖ్యమంత్రిని కోరింది. ఈ ప్రాజెక్టు మంజూరైతే తెలంగాణ ప్రజలు ఎప్పటికీ కృతజ్ఞులుగా ఉంటారని సంఘం పేర్కొంది. కార్యక్రమంలో టీఏఆర్‌హెచ్‌ఈ అధ్యక్షుడు ఎన్ రంగారెడ్డి, కె.ఎస్.ఎన్.రెడ్డి, భాగ్యతారెడ్డి, నారాయణ రెడ్డి, డి. భీమయ్య, ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చిన్నారెడ్డి వారికి హామీనిచ్చారు.

డైరీని ఆవిష్కరిస్తున్న చిన్నారెడ్డి, రంగారెడ్డి, కెఎస్ఎన్ రెడ్డి తదితర రిటైర్డ్ ఇంజనీర్లు

మహిళలకు చీరెలు పంచిన అభిషేక్ అడపా, షేక్ గౌస్

-మహిళలకు సంక్రాంతికి చీరెలిచ్చి సన్మానించడం సంతోషంగా ఉంది : డా.కోట నీలిమ

బేగంపేట జనవరి 10,ప్రభాతవార్త : రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రజా ప్రభుత్వంలో మహిళల పాత్ర కీలకంగా ఉందని,ప్రతి పథకం ముందుగా వారికే అవకాశం కల్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సనత్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు.బేగంపేట డివిజన్ పరిధిలోని పాటిగడ్డ పైగా ప్యాలెస్‌లో సనత్‌నగర్ నియోజకవర్గం మాజీ ఏ బ్లాకు అధ్యక్షులు షేక్ గౌస్,యువ నాయకుడు అభిషేక్ అడపాల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళా సంఘాల గ్రూపు సభ్యులకు చీరెల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ,సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్ లు హాజరయ్యారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన మహిళా గ్రూపుల సభ్యులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా చీరెలు (సంక్రాంతి సారె) పంపిణీ చేసారు.ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ మహిళలు పండుగ పూట మంచి చీరె ధరించి మహాలక్ష్మిలాగా ఉండాలనే ఉద్దేశ్యంతో మహిళలకు చీరెలు పంపిణీ చేసిన అభిషేక్ అడపా,షేక్ గౌస్ లను తాను ప్రత్యేకంగా అభినందనలు,కృతజ్ఞతలు తెలియజేసారు.ఆడ బిడ్డలు అమ్మవారి ప్రతిరూపాలని ఆమె పేర్కొన్నారు.ప్రజాపాలన అంటే మహిళల అభిమానాన్ని సంపాదించడమేనన్నారు.సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్ మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో అభిషేక్,గౌస్‌లు చేపట్టిన చీరెలు (సారె)పంపిణీ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు.గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను విస్మరించిందన్నారు.ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల విద్యుత్ ఇచ్చిన ఘనత రేవంత్ ప్రభుత్వానిదేనన్నారు.అభిషేక్,షేక్ గౌస్‌లు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా డివిజన్ పరిధిలోని మహిళలను చీరెలు ఇచ్చి సత్కరించుకోవడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. డా.కోట నీలిమ మార్గదర్శకత్వంలో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలను తాము ముందు ముందు నిర్వహించనున్నట్లు తెలియజేసారు.కోట నీలిమ,దీపక్ జాన్‌లకు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు డివిజన్ అధ్యక్షుడు గౌరపల్లి రమేష్,రమాదేవి, సీ.రాజేందర్,సలీంఖాన్, నసీరుద్దీన్(అడ్డు),మహేష్‌యాదవ్,చంద్రకళ,సువర్ణ,రాధ,భవాని,సులేఖ,బుష్రా,భవాని,లలిత,హనీఫ్,మునీర్,1000మందికి పైగా మహిళలకు చీరెలు పంపిణీ చేసారు.

బేగంపేట పైగా ప్యాలెస్‌లో మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న కోటనీలిమ,దీపక్‌జాన్,అభిషేక్,షేక్‌గౌస్ తదితరులు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రెస్‌క్లబ్ జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి, ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ.రాజేష్ తదితరులు

హైదరాబాద్, జనవరి 10,ప్రభాతవార్త: జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ రూపొందించిన ప్రెస్ క్లబ్ జర్నల్ ను మంత్రి సచివాలయంలో శనివారం ఆవిష్కరించారు. తెలుగు ఇంగ్లీష్ భాషల్లో ప్రతినెల ప్రెస్ క్లబ్ జర్నలను రూపొందించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ జర్నల్లో జర్నలిస్టులకు సంబంధించిన సమకాలిన అంశాలు పొందుపరచడం సంతోషకరమని ప్రెస్ క్లబ్ నూతన పాలకమండలి ఏర్పడి మూడు నెలలు అయినప్పటికీ జర్నలిస్టుల సంక్షేమ అభివృద్ధికి వివిధ కార్యక్రమాలను రూపొందించామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్ విజయకుమార్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల మంత్రికి వివరించారు. ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని ఇదిఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రికి వివరించారు. జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్ క్ల బ్ ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు శంకర్ శీగ, ఎన్. ఉమాదేవి, రచన ముడుంబై, వనం నాగరాజు, అమిత్ బట్టు పాల్గొన్నారు.

పేదల కడుపు కొట్టేందుకు 'ఉపాధి' పేరు మార్పు

- గుట్టలో కాంగ్రెస్ ఆందోళన

ఉపాధి హామి పథకం పేరు మార్పును నిరసిస్తూ చాంద్రాయణగుట్ట చౌరస్తాలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

చాంద్రాయణగుట్ట, జనవరి 10, ప్రభాతవార్త : కేంద్రంలోని నరేంద్ర మోది ప్రభుత్వం పేదల కడుపు కొట్టేందుకు ఉపాధి హామి పథకం పేరు మార్చిందని చాంద్రాయణగుట్ట నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బోయ నాగేష్ విమర్శించారు. ఏఐసీసీ పిలుపు మేరకు చాంద్రాయణగుట్ట నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం చాంద్రాయణగుట్ట చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆందోళన చేపట్టారు. ఉపాధి హామి పథకం పేరు మార్పును నిరసిస్తూ కూడలిలో బయఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసే కుట్రలో భాగంగానే మన్‌రే గా మార్పన్నారు. దేశంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే నని, మార్చిన పేర్లను తిరిగి పునర్దురించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ, మండ స్థాయి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిసి ఏ గ్రూప్‌లోకి ఇతర కులాలను చేర్చరాదు

సైఫాబాద్, జనవరి 10 ప్రభాతవార్త: అన్ని రంగాలలో వెనకబడి ఉన్న 68 కులాలు బీసి ఏ జాబితాలో ఉన్నాయని, ఇవి అభివృద్ధి చెందక ముందే ఇతర కులాలను బీసీ ఏ జాబితాలో చేర్చరాదని తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సమితి హెచ్చరించింది. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరిక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.భాగయ్య, గంగపుత్రుల సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి తదితరులు మాట్లాడుతూ బీసీ ఏ జాబితాలో ఉన్న కులాల జనాభా వాటా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ముదిరాజ్ కులస్తులతోపాటు ఇతర కులస్తులు బీసీ ఏ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారని, ఇటీవల రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సైతం ముదిరాజ్ కులస్తులను బీసీ డి జాబితా నుంచి ఏ జాబితాలో చేర్చుతామని బహాటంగా ప్రకటించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వారన్నారు. ప్రస్తుతం ఏ జాబితాలో ఉన్న కులాలు అభివృద్ధి చెందకుండా ఆనేక కులాల ఉన్నాయని, ఇందులో యాచక, సేవా కులాలు అత్యధికంగా ఉన్నాయని చెప్పారు. అభివృద్ధి చెందిన కులాలను ఇందులో చేర్చితే సహించేది లేదని హెచ్చరించారు. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తే బీసీ ఏ గ్రూప్‌కు 12 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పరిరక్షణ సమితి నాయకులు కంటి రాంచందర్, అంబటి సుధాకర్, శివరత్నం, గడప శంకర్, డా.మురళీమనోహార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.భాగయ్య

నిషేధిత చైనా మాంజా విక్రయించినా.. కొన్నా కేసులే

- ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిన్నారులకు, కాలనీ వాసులకు చైనా మాంజాపై అవగాహన కల్పిస్తున్న ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య

చాంద్రాయణగుట్ట, జనవరి 10, ప్రభాతవార్త : ప్రాణాంతకమైన నిషేధిత చైనా మాంజను విక్రయించానా, కొన్నా కేసులు నమోదు చేస్తామని ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య స్పష్టం చేశారు. శనివారం ఫలక్‌నుమా రవీంద్రనాయక్ కాలనీలోని బంజారా కమ్యూ నిటీ మైదానంలో బస్తీవాసులకు, చిన్నారులకు చైనా మాంజాపై అవగాహన కల్పించారు. గాజు పూత పూసిన సింథటిక్ చైనా మాంజాను అమ్మటం నేరమన్నారు. చైనా మాంజా వల్ల జంతువుల కు, మూగ జీవలకు ప్రమాదకరమన్నారు. ఇటీవల నగరంలోని ప లు చోట్ల చైనా మాంజాతో గయపడి, చనిపోయిన వారి గురించి వివరించారు. పక్షులు మాంజాకు చిక్కుకొని ప్రాణాలు పోగుట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. భవనాలు, వంతెనలపై గాలిపాటాలు ఎగురవేసి ఇబ్బందులు తెచ్చుకోవద్దని తెలిపారు. గాలి పటాల వ్యాపారులు నిషేధిత చైనా మాంజా ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ప్రత్యేక పోలీసు బృందాలతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.పిల్లలు,యువకులు గాలి పటాలు ఎగురవేసే సమ యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చైనా మాంజా విక్రయించానా,కొన్నా వారి వివరాలను తమకు తెలియజేయాలని కో రారు.అనంతరం చిన్నారులకు గాలిపటాలను, సాధారణ మాంజాను పంపిణీ చేశారు.కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది,పాల్గొన్నారు.

వార్త CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, PATLOLLA JAIPAL REDDY S/O LATE PATLOLLA MANIK REDDY, R/o. H.NO. 2-2-104/102 & 103, RD NO.3, SRI SAI ENCLAVE, ALWAL, SECBAD-HYD, TG-10. Have Changed My Name From JAIPAL CHARY S/o. R. Shanker Chary To PATLOLLA JAIPAL REDDY S/o.Late Patlolla Manik Reddy. For all Future Purposes.

LOSS OF DOCUMENT

★ I, Smt K.Soujanya w/o Sri K. Yadagiri R/o H no 8-5-263, Syndicate Bank Colony, Old Bowenpally, Tirumalagiri, Sec'bad. I may have been misplaced my original sale deed Bearing Document no 2958/2015 on date 29th sep 2020. On which date I was traveling from Rajahmundry to Hyderabad. If any body found please contact 7416576995.

TO LET OR RENT

★ Ground Floor 3 Shops for Rent 350 sft each, Abids Main Road 30,000 each 7416393362. Parking available.

(Ro.No.37445)

గమనిక

ఖాళీస్థలాలు ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

IN THE COURT OF THE HON'BLE XI ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT AT:: KUKATPALLY O.S. No. 350 of 2025

Between:
Mudindi Santosh Varma, Rep. by its GPA M. Viswanadha Raju ...Plaintiff
AND
Swaroopa Rani & another ...Defendant

To,
1. Smt. Swarupa Rani C/o S. Nageshwar Rao, Aged about 53 years, Occ: Business,
2. Samyuktha Priyanka C/o S. Nageshwar Rao, Aged about 28 years, Occ: Business,
Both are residing at Villa NO. 45, Spring Woods Villas, Door No. 7-150/SPW/45, Bowrampet, Dundigal, Gandhimaisamma, Medchal-Malkajgiri Dist., Telangana - 43

NOTICE

Please take notice that the above named plaintiff filed a suit for recovery of money of Rs. 4,70,975.73/- against both you. The above suit is posted to 12.02.2026 at 10.30 AM for yours appearance.

Therefore it is inform that both of you are required to appear in person or through an advocate by submitting written statement if any before the above Hon'ble court on 12.02.2026, at 10.30 AM otherwise the matter will be decided as per law.

(By order of the Hon'ble court)
M. VENKATESWARLU
ADVOCATE
Off: H. No.3-83/1/A/4, Eeswar Villas Road, Nizampet, Hyderabad - 90
Cell No: 7075882869

IN THE COURT OF THE HON'BLE XXV ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD O.S. 3 Of 2026

Between :
Maroju Vijaya Lakshmi and Others ...Plaintiff
And
1. The Tahsildar, Saidbad Tahsildar Office, Saidabad, Hyderabad-500059, Telangana.
2. All Concerned. ...Defendants

Sir/Madam,

Whereas the above named Plaintiffs have filed the above suit seeking the declaration as legal heirs of Late Maroju Somachary who died on 18.04.2024. Therefore, all concerned are hereby requested to appear before the Hon'ble court at 10.30 A.M. on 06-02-2026 either in person or through Counsel duly instructed if you have any objection. Otherwise the matter will be heard and decided exparte in your absence.

All that part of House No. H.No. 16-11-16/N/159, on Plot No. 159 admeasuring 280 Sq.Yds or House G+1 with a plinth area of 1425 Sft in Ground Floor & 1425 Sft in First Floor in Sy No.64, 65 and 66 in Ward No.16, Block No.11 admeasuring 280 Sq.Yards or equilant to 234.10Sq.Meters, West Prashanth Nagar, Moosarambagh, VTC Amberpet, Malakpet Colony, Hyderabad-500036, Telnagana, and bounded as follows: NORTH : Plot No. 158. SOUTH : Plot No. 160. EAST : 30 feet wide road. WEST : Plot No. 151.

(By order of the Court)
J Purnachandra Reddy,
Advocate,
#119/A Westpart, Road No.16, Snehapuri Colony, Nagole, Hyderabad,Telangana-102.
Ph: 97009 56789

IN THE COURT OF HONBLE I ADDL JUNIOR CIVIL JUDGE-Cum- V ADDITIONAL METROPOLITAN MAGISTRATE ::MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: L B Nagar O.S. NO: 1403 OF 2025

Between:
Smt GADE ANASUYA & OTHERS ...Plaintiffs 1 to 5
And
THE TAHSILDAR GHATKESAR MANDAL & ANOTHER ...Defendants 1 & 2

To All Concerned
That the above-named plaintiff was filed the above suit for declaration to declare them as Class I Legal Heirs in respect of suit schedule property of deceased Late GADE RAMESH who died intestate Dated 03.12.2024. Against you and another, said suit is posted on 22.01.2026 for objections. If any person or persons is /are having any objections may appear before the Hon'ble Court on dtd 22.01.20256 at 10:30 AM. Either in person or through an Advocate. Failing which the matter will be decided as per law in your Absence. **SCHEDULE OF THE PROPERTIES 1 :** All that the Open Plot No. 393, in Survey Numbers 35/P, 36/P, 48/P, 58/P, 59/P, 60/P & 61/P, 85 and 86, admeasuring 242 Sq.Yds. or 202.34 Sq.Mtrs. situated at Kondapur Village, Ghatkesar Mandal, Medchal-Malkajgiri Dist. Under the purview of Sub Registrar Ghatkesar, and bounded by:, NORTH : Neighbour's Land, SOUTH: Plot No. 394, EAST: 30 Wide Road, WEST : Plot No. 392. **SCHEDULE OF THE PROPERTY 2:** All that the Open Plot No. 22, in Survey Numbers 35/P, 36/P, 48/P, 58/P, 59/P, 60/P & 61/P, 85 and 86, admeasuring 247 Sq.Yds. or 206.52 Sq.Mtrs. situated at Kondapur Village, Ghatkesar Mandal, Medchal- Malkajgiri Dist. Under the purview of Sub Registrar Ghatkesar, and bounded by: NORTH : Neighbour's Land, SOUTH : Plot No. 23, EAST :Plot No. 45, WEST: 30 Wide Road.

//By Order of the court//
Y BHARATH
Advocate,
Ho.No: 2-81/59/43 Dwarakanagar phase 1, Chengicherla, Hyderabad 500098,
Ph:9618214652
Email: ybharath716@gmail.com

IN THE COURT OF THE

పంచవటి విఘ్నేశ్వర స్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

మేడిపల్లిలో పంచవటి విగ్నేశ్వర స్వామి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తుంగతుర్తి రవి , సుభాష్ నాయక్ , మణిరాం నాయక్ , శ్రీనివాస్ రెడ్డి, తదితరులు

మేడిపల్లి, జనవరి 10 ప్రభాతవార్త ; మేడిపల్లిలో శ్రీ పంచవటి విఘ్నేశ్వర స్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి,మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్ ,పంచవటి కాలనీ అధ్యక్షులు మణరాం నాయక్, హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచవటి కాలనీ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,ముక్తేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వాసు, శ్రీరామ కృష్ణ, అర్చకులు శరత్ కుమార్,ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ సభ్యులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

సంస్కృతి సంప్రదాయాలు వారసత్వ సంపద : చైర్మన్ శ్రీనివాసరావు

అవంతి డిగ్రీ పీజీ కళాశాలలో సంక్రాంతి పండుగ సంబరాలను నిర్వహిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు విద్యార్థులు తదితరులు

మలక్ పేట, జనవరి 10, ప్రభాతవార్త: మన సంస్కృతి సంప్రదాయాలు వారసత్వ సంపద అని అవంతి గ్రూప్ విద్యా సంస్థల చైర్మన్ ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు దిల్‌షుక్ నగర్ అవంతి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం, సంక్రాంతి పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు సాంప్రదాయక దుస్తులను దరించి రంగురంగుల రంగవల్లులను అందంగా తీర్చిదిద్దడంలో పాటు ఆటపాటలతో సందడి చేశారు. గంగిరెద్దుల కోలాటం, భోగిమంటలు తదితర కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీలలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పండుగలను అందరూ కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా సంతోషంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల హెచ్ఆర్ డైరెక్టర్ జయప్రద, హెచ్ ఆర్ మేనేజర్ శ్రీలక్ష్మి ,మెంటర్ సందీప్, రిటైర్డ్ ప్రొఫెసర్ సామ్రాజ్యం, కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు, ఇన్చార్జ్ మోహన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

- ఆస్మాన్ ఘడ్ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి

ఆస్మాన్ ఘాడ్ డిఇ విష్ణువర్ధన్ రెడ్డికి1104 యూనియన్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని అందజేస్తున్న యూనియన్ నాయకులు రామకృష్ణానంద్,, తిరుపతి తదితరులు

మలక్ పేట ,జనవరి 10, ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ శాఖ డీఇ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. 1104 యూనియన్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అస్మాన్ ఘాడ్ డిఇ విష్ణువర్ధన్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి డైరీ, క్యాలెండర్ లను అందజేశారు. అదేవిధంగా అడ్మిషన్ సెక్షన్ జెఏ, సీనియర్ అసిస్టెంట్ ఎన్. మహేందర్, సూరిబాబులను కలిసి శాలువాలతో సన్మానించి డైరీ, క్యాలెండర్లను అందజేశారు. అనంతరం యూనియన్ ప్రాంతీయ అదనపు కార్యదర్శి తిరుపతి, డివిజన్ కార్యదర్శి కందుకూరి రామకృష్ణా నంద్ లు మాట్లాడుతూ విద్యుత్ సిబ్బందికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఐ శ్రీనివాస్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు మహమ్మద్ అహ్మద్ అలీ, అదనపు కార్యదర్శి బి యాదగిరి, డివిజన్ కోశాధికారి హరికృష్ణ, స్టేట్ ఆఫీస్ బేరర్ ఎన్ వినోద్ కుమార్, డిస్కమ్ ఆఫీస్ బేరర్ ఎన్ బాల్ రెడ్డి, కే.వేణుగోపాల్ రెడ్డి , జయరోద్దీన్ డివిజన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విజయ హై స్కూల్‌లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు

విజయ హైస్కూల్లో ముగ్గుల పోటీ నిర్వహిస్తున్న దృశ్యం.

కుషాయిగూడ, జనవరి 10, ప్రభాతవార్త. విజయ హైస్కూల్ ఆదిత్యనగర్ కాప్రాలో సంక్రాంతి పర్వదిన వేడుకల సంబురాలు కోలాహలంగా ఘనంగా జరిగాయి. రంగోళి పోటీల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని మైదానమంతా రంగు రంగుల ముగ్గులతో హరివిల్లును తలపించేసారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల డైరెక్టర్ కొప్పునూరి వీణ మాట్లాడుతూ.. మహిళలందరూ పండుగల విశిష్టత, సంస్కృతిని భావితరాలకు అందించి తర్వాత తరాలను భాగస్వాములను చేయాలి. వాళ్లకు కూడా మన పండుగలు ప్రాధాన్యతలను తెలియజేయాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి 1500/ రూపాయలు, రెండవ బహుమతి 1000/, మూడవ బహుమతి 500/ రూపాయల నగదు బహుమతులను విజేతలకు అందించారు. మిగతా పాల్గొన్న వారందరికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ప్రైమరీ ఇంచార్జ్ ఆర్.సునీతా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

ఉపాధి హామీ పథకాన్ని బిజెపి నీరుగార్చే కుట్ర చేస్తుంది : ఖలేద్ స్తెఫుల్లా

మలక్ పేట, జనవరి 10, ప్రభాతవార్త: పేదలకు ఉపాధి,లబ్ది చేకూరేలా నాటి యుపిఎ ప్రభుత్వం చట్టం చేసి తీసుకొచ్చిన 100రోజుల ఉపాధి హామీ పథకం ను నేడు కేంద్రంలో ఉన్న బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం నీరుగార్చి,ఎత్తేసే కుట్ర చేస్తోందని హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఆరోపించింది.మలక్ పేట నియోజకవర్గంలోని అక్బర్ బాగ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ మీడియా సమావేశంలో మలక్ పేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి షేక్ అక్బర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ (డీసీసీ) జిల్లా అధ్యక్షులు ఖాలేద్ సైఫ్ ఉల్లా ఖాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005 లో నాటి యుపిఎ ప్రభుత్వం నిరుపేద,నిరుద్యోగులకు ఉపాధి కొరకు నాటి ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ (100 రోజులు) ఉపాధి హామీ పథకం చట్టం ను ఎత్తేసేందుకే నేడు కేంద్రంలోని బీజేపీ మోదీ ప్రభుత్వం ఎంజిఎన్ఆర్ఇజీఎ పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించిందని, మహాత్మా గాంధీ, నెహ్రూ పేరు వింటే బీజేపీకి వెన్నులో వణుకు పుడుతుందని,మూడు దఫాలుగా అధికారానికి వచ్చిన బీజేపీ ఇప్పటికే పలు పథకాలను నీరుగార్చి ఎత్తేసిన తీరునే 100రోజుల ఉపాధి హామీ పథకంను ఎత్తేస్తుందని ఆరోపించారు. ఉపాధి

సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖలేద్ స్తెఫుల్లా, చిత్రంలో మలక్ పేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ తదితరులు

హామీ పథకం ను తిరిగి తెచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం సూచనల మేరకు కార్యాచరణతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. నేడు బీజేపీ ప్రభుత్వం పేదలకు సంక్షేమం ను దూరం చేసి, అంబానీ, ఆదానిలకు దోచి పెడితే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట ఇంచార్జి బొయ్య నగేష్, చార్మినార్ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్ ,బహదూర్ పురా ఇంచార్జి రాజేష్, టీపీసీసీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అశ్వక్ ఖాన్, నాయకులు ధర్మేందర్, సాయి కిషోర్, సుభాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగంపై తీవ్ర ఆగ్రహం

నాచారం, జనవరి 10 ప్రభాతవార్త : నాచారం డివిజన్ ఎర్రకుంట లోని పటేల్ కుంట చెరువులోకి మురుగునీరు చేరకుండా అరికట్టేందుకు రూ. కోటి 80 లక్షల రూపాయల వ్యయంతో జిహెచ్ఎంసి ఇరిగేషన్ వారు చేపట్టిన సివరేజ్ డైవర్షన్ పనులు సుమారు మూడు సంవత్సరాల క్రితం ప్రారంభమయ్యాయి.అయితే ప్రజాధనంతో చేపట్టిన ఈ కీలక పనులు సుమారు 80 శాతం మాత్రమే పూర్తిచేసి మధ్యలోనే నిలిపివేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది.ఈ అసంపూర్తి పనుల వల్ల చెరువులోకి మురుగునీరు యథా విధిగా చేరుతుండటంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై నాచారం డివిజన్ కార్పొరేటర్ పలుమార్లు ఇరిగేషన్ అధికారులను మిగతా పనులు వెంటనే పూర్తి చేయాలని విన్నవించినప్పటికీ, కాంట్రాక్టర్ రావడం లేదు" అంటూ బాధ్యతను తప్పించుకునే ప్రయత్నం చేయడం జరిగింది.తాజాగా వెలుగులోకి వచ్చిన నిజం ఏమిటంటే - కోటి 80 లక్షల రూపాయలతో చేపట్టిన డైవర్షన్ పనులు సరైన లెవెల్ లేకుండా, సాంకేతిక లోపాలతో నిర్మించబడిన కారణంగానే కాంట్రాక్టర్ అధికారులు చేసిన పనులకు బిల్లులు చెల్లించారని అనంతరం పనులు మధ్యలోనే వదిలి వెళ్లిపోయాడు. ఇది అధికారుల నిరక్ష్యం, కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా మారిందని స్థానికులు ఆరోపించారు. ఈ తీవ్రమైన అంశాన్ని జిహెచ్ఎంసి కమిషనర్ కు విజిలెన్స్ అధికారులకు కార్పొరేటర్ ఫిర్యాదు చేయడంతో శనివవారం విజిలెన్స్ సీఐ అమృత్ రెడ్డి, ఏఈ రోహిత్ రెడ్డి,ఇరిగేషన్ ఏఈ. ఆంజనేయులు, కమురుద్దీన్, సిబ్బంది పటేల్ కుంట

సమస్యను విజిలెన్స్ అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

చెరువు వద్దకు చేరుకొని డైవర్షన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పరిశీలన అనంతరం, ఈ పనులు పూర్తిగా అధికారుల కాంట్రాక్టర్ తప్పిదం వల్లే ప్రజలకు ఉపయోగం లేకుండా పోయాయని విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ మొత్తం వ్యవహారంపై కమిషనర్‌కు పూర్తి స్థాయి నివేదిక అందజేస్తామని విజిలెన్స్ అధికారులు కార్పొరేటర్‌కు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మాకు ఎవరి మీద కక్ష గాని కోపం గాని లేదు బాధ్యులకు శిక్ష పడాలననే ఉద్దేశం లేదు. కానీ ప్రజాధనంతో చేపట్టిన ఈ డైవర్షన్ పనులు సరైన డిజైన్, సరైన లెవెల్‌తో తిరిగి నిర్మించి చెరువులోకి వచ్చి చేరుతున్న మురుగునీరును డైవర్షన్ చేయడంతో చెరువులోకి శుద్ధి చేయబడిన నీళ్లు వస్తే నాచారంలో దోమల సమస్య పూర్తిగా తొలగిపోతుందని కార్పోరేటర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజన్ శేఖర్, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, మంగోల్ శివకుమార్, చంద్రశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ సర్కిల్‌లో ఆలయాల వద్ద బిజెపి నేతల పూజలు

ఉప్పల్‌లోని భవానీ శంకర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

హబ్సిగూడ వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బిజెపి నేతలు తిండేరు హన్మంతరావు, గడ్డం సాయికిరణ్ తదితరులు

ఉప్పల్, జనవరి 10 ప్రభాతవార్త : సోమనాదజ్ ఆలయం పునః నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా సోమనాదజ్ ఆలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ఆలయాల్లో బిజెపి నేతలు పూజలు నిర్వహించారు. ఉప్పల్‌లోని భవానీ శంకర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు గొరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణ గౌడ్, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి, వర్కల రాజేందర్ గౌడ్, సింగారం కార్తీక్, ఎల్లగొని ప్రకాష్ గౌడ్, బోరంపేట మురళీ, గొరిగె వెంకటేష్, ఉప్పు శంకర్ గుప్తా, బూత్కరి రాజేష్ గౌడ్, గుండె పూనెందర్, ఆకుల రాకేష్, సోమేశ్వర చారి, శ్రీరాం జ్యోతి, మేనక, అంజి బాబు పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో..

రామంతాపూర్‌లో బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి ఆధ్వర్యంలో శ్రీ గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో పలువురు బిజెపి నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు మాజీ కౌన్సిలర్ తిండేరు హనుమంతరావు, వి.సోమశేఖర్ గౌడ్, వల్లపు జగన్ యాదవ్, గడ్డం సాయికిరణ్, పూజారి సోమయ్య గౌడ్ ,పెంటపల్లి వెంకన్న ,బండి పద్మ ,సాదినేని గీత ,చింతకింది ప్రవీణ్,వులుగోండ నారాయణ దాస్, దారం వెంకటేష్ గుప్తా, పారుపల్లి హనుమంతారావు, పీసరి శంకర్ ,ఆవుల సుధాకర్ ,బానోత్ రమేష్ నాయక్, పుచ్చల అశోక్ , జి హరిబాబు, రాపోలు సాయి, జెట్ట సాయి ధీరజ్, గడ్డం వెంకట సాయి, ఆలయ అధ్యక్షుడు బైరోజు రామస్వామి, ఆలయ అర్చకులు పత్తిపాక శ్రీధర్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఆధ్వర్యంలో..

ఉప్పల్‌లో బిజెపి డివిజన్ అధ్యక్షుడు మారినేని ఫణింద్ర ఆధ్వర్యంలో శ్రీ శివ శంకర మహామాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేత యు.బల్వంతాచారి, బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు, ఉపాధ్యక్షుడు అంజి రెడ్డి, సీనియర్ నాయకులు శామీర్‌పేట హనుమంత్ రెడ్డి, జూలూరి శ్రీధర్ గుప్తా, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఆడెపు రమేష్, మద్దెల పద్మ, మేనక, ఉప్పాజీ రాజు, రామయ్య, గురువయ్య, ఆరూరి కిషోర్, అభిరామ్, స్వామి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. చిలుకానగర్‌లో బిజెపి డివిజన్ అధ్యక్షుడు దత్త సాయి ఆధ్వర్యంలో ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా గ్రేటర్‌పై బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం:సబితాఇంద్రారెడ్డి

ఎల్.బి.నగర్, జనవరి 10 ప్రభాతవార్త: డివిజన్ల విభజన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏకరూప పన్నుల విధానాన్ని వెంటనే అమలు చేయాలని, శివారు ప్రాంతాల కాలనీవాసులకు ఉచిత మంచినీరు అందించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్.కె.పురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నాగేష్ అధ్యక్షతన గ్రీన్‌హిల్స్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబిత మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో అధిక మెజార్టీ ఇచ్చిన ఆర్‌కేపురం వాసులకు ధన్యవాదాలు తెలుపుతూ రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో మరింత మెజారిటీతో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఉద్యమ కారులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. స్వార్థం కోసం కేసీఆర్ ఎప్పుడూ పనిచేయాలేదని, కేసీఆర్‌ను అవమానించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూన్నారని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. డివిజన్ల విభజన సరిగా లేదని, ప్రబుత్వం ఎన్ని కుట్రలు చేసినా బిఆర్ఎస్ గెలుపును కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ మాట్లాడుతూ

సమావేశంలో మాట్లాడుతున్న సబితాఇంద్రారెడ్డి చిత్రంలో అరవింద్‌శర్మ

నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్, బిజెపి ఇద్దరు శత్రువులను తరిమికొట్టాలన్నారు. ఎక్కువ మంది ఉద్యమకారులు ఉన్న డివిజన్ లో పార్టీ బలంగా ఉందన్నారు. అందరు కలిసి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, టికెట్ ఎవరికీ వచ్చిన పనిచేసి బిఆర్ఎస్ జండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతరెడ్డి, శ్రీధర్, కృష్ణారెడ్డి, ఊర్మిళారెడ్డి, రామాచారి, కొంద్రు శ్రీనివాస్, సాజీద్, రామ్‌నరసింహగౌడ్, ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, ఎండి.జాహీద్, శ్యామ్‌గుప్తా, యుగంధర్‌శర్మ, కంచర్ల శేఖర్, బాలు, ఇస్మాయిల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ ప్రశాంతినగర్ కాలనీ సంఘం డైరీ ఆవిష్కరణ

ఉప్పల్, జనవరి 10 ప్రభాతవార్త : ఉప్పల్ ప్రశాంతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని శనివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రశాంతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.విజయ మోహన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కాలనీ సంఘం అభివృద్ధికి తమ వంతు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కాలనీ అధ్యక్షుడు డా.ఎస్.విజయ మోహన్, కార్యదర్శి కృష్ణస్వామి, ఉపాధ్యక్షుడు ముత్యంరెడ్డి, సంయుక్త కార్యదర్శి సాంబిరెడ్డి, సుబ్బారెడ్డి, కోశాధికారి ప్రవీణ్, కోశాధికారి నాగేశ్వరరావు, సభ్యులు లక్ష్మి భూమేష్, విజయలక్ష్మి, శ్రీకాంత్, బిఆర్ఎస్ పార్టీ నేతలు ఏదుల కొండల్‌రెడ్డి, కొక్కండ జగన్, మాసశేఖర్, ఎం.శ్రీనివాస్, రామాంజనేయులు, మార్క శీను ,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ ప్రశాంతినగర్ కాలనీ డైరీ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత, కాలనీ సంఘం నేతలు

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కృషి : సెక్రెటరీ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి

విద్యార్థులు ప్రదర్శించిన అంశాలను తిలకిస్తున్న కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ రాజవల్లి తదితరులు

మలక్ పేట, జనవరి 10, ప్రభాతవార్త: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలిగి తీయడానికి కృషి చేస్తున్నామని అనిబిసెంట్ మహిళా కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ లోని అనిబిసెంట్ ఉమెన్స్ కళాశాలలో కన్ వర్జన్స్ థియరీ టు ప్రాక్టీస్ ఎగ్జిబిషన్ ఘనంగా కళాశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని కామర్స్ అండ్ మేనేజ్మెంట్, స్టాటిస్టిక్స్ , సైకాలజీ, ఇంగ్లీష్, మాథ్స్, ఫిజిక్స్, సైన్స్ ,మైక్రోబైయలజీ, బయోటెక్నాలజీ, జువాలజీ, బాటని మొదలగు విభాగాలు తమ తమ విభాగానికి సంబంధించిన నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ లో ప్రదర్శించిన అంశాల గురించి విద్యార్థులు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ సత్యనారాయణ, కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, ప్రిన్సిపల్ రాజవల్లి దేవి తదితరులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు విద్యార్థులలో నూతన ఆలోచనలను వెలికి తీయడానికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి

హయత్ నగర్, జనవరి 10 ప్రభాతవార్త : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని ద్రోణాచార్య అవార్డు గ్రహీత పద్మశ్రీ ఎస్.ఎం.ఆరిఫ్ సూచించారు. హయత్ నగర్ లోని జీ స్కూల్ లో నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల లోని ప్రతిభను గుర్తించి వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. జీ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు చక్కని క్రీడా మైదానాలను అందుబాటులో ఉంచడం అభినందనీయ మన్నారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అనంతరెడ్డి, సుదర్శన్ రెడ్డి, నాగేంద్రబాబు, సీఈఓ గిరిజా రెడ్డి, ప్రిన్సిపల్ పూర్ణా శ్రీవాస్తవ, కోఆర్డినేటర్లు శ్రీధర్ రెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

స్వామివారి కైంకర్యానికి రూ.50వేల వితరణ

ఉపేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దేవాలయం ప్రతినిధులు

ఎల్.బి.నగర్, జనవరి 10 ప్రభాతవార్త: శ్రీజ్ఞానసరస్వతీ దేవాలయ త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాల కైంకర్యానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి రూ.50వేలు వితరణ చేశారు. ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్‌కాలనీలోని శ్రీజ్ఞానసరస్వతీ దేవాలయం సముదాయానికి(శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన సంచాలిత) ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్వామి వార్లకు కైంకర్యము కోసం రూ.50వేలను ఆలయ కమిటీ సబ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సబ్యులు మాట్లాడుతూ దేవాలయ సముదాయానికి విరాళాన్ని అందజేసినందుకు ఉపేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సేవాగుణంతో దేవాలయ అభివృద్ధికి సహకరించారని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సముదాయ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, వైస్‌చైర్మన్ ఆనంద్‌రావు, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వసుంధర్, కోశాధికారి సాయి రాఘవేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్‌కుమార్, దేవాలయ కమిటీ సబ్యులు కోటేశ్వర్ రావు, కాలనీ వాసులు రాజు, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హబ్సిగూడలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

హబ్సిగూడలో ముగ్గుల పోటీల విజేతలక